ఆంధ్రజ్యోతి

# 'తానా', 'నాట్స్' వేడుకలు నేడే ప్రారంభం

## ప్రవేశ రుసుం గణనీయంగా తగ్గింపు

షికాగో/ఆర్లాండో, జులై ౨ : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాట్స్) అమెరికాలో నిర్వహిస్తున్న వేడుకలు నేడు ప్రారంభం కానున్నాయి. ఆర్థిక మాంద్యం ప్రభావం వలన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉండడంతో రెండు సంస్థలూ ఈ వేడుకలకు ప్రవేశ రుసుమును గణనీయంగా తగ్గించాయి. రానుపోను విమాన చార్జీలను బేరీజు వేసుకుని అమెరికాలోని పలు రాష్ట్రాల నుంచి పెక్కు మంది తెలుగువారు కార్లలోనే షికాగో, ఫ్లోరిడా బయలుదేరినట్లు తెలుస్తున్నది.

ఆర్థిక మాంద్య ప్రభావం ఈసారి సభలకు వచ్చేవారి సంఖ్యపై పడవచ్చుననే భావనతో ముందుగా 'తానా' ప్రవేశ రుసుమును గణనీయంగా తగ్గించింది. అదేవిధంగా 'నాట్స్' కూడా వేడుకలకు ప్రవేశ రుసుమును గణనీయంగా తగ్గించింది. భోజనంతో కలుపుకుని వేడుకల ప్రవేశరుసుం భారీగా ఉండడంతో, భోజనం లేకుండా విడిగా వేడుకల్లో పాల్గొనేందుకు మాత్రమే ఆయా సంస్థలు ప్రవేశ రుసుమును నిర్ధారించాయి. ఇలా కేవలం వేడుకలు తిలకించేందుకు మాత్రమే ప్రవేశ రుసుము చెల్లించిన వారు విడిగా భోజనం లేదా ఇతర ఆహార పదార్థాలను కొనుక్కోవలసి వుంటుంది. ఇంకా తెలుగు విద్యార్థులు, నిరుద్యోగుల కోసం కూడా ఈ సంస్థలు వేర్వేరుగా ప్రవేశ రుసుములు తగ్గిస్తూ ఆఫర్లు ప్రకటించాయి. దీనితో ఈ వేడుకలకు వెళ్ళాలని ఉవ్విళ్ళూరుతూ ఖర్చుతో వెనకడుగు వేసే వారు సైతం ఈ ఆఫర్లతో సభా సంబరాలను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నారు.